క్లుప్తంగా

వారోత్సవాలను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ పింఛను కానుక రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచడంతో.. ప్రభుత్వం వైఎస్సార్ పింఛను కానుక వారోత్సవాలను నిర్వహిస్తోందని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4న తాడేపల్లి శుభమస్తు కల్యాణ మండపంలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, లబ్ధిదారులు, అధికారులు, సచివాల సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్, ఎస్సీ విభాగం కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు నలుకుర్తి రమేష్ కోరారు. శనివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ప్రకాష్ మాట్లాడుతూ విజయవాడలో ప్రభుత్వ నిధులతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఈ విగ్రహాన్ని జనవరి 19న దళిత బాంధవుడు, పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఆర్‌సీఎం చర్చిలో ఎంపీ బాలశౌరి ప్రార్థనలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పెదవడ్లపూడికి ఎంపీ బాలశౌరి శనివారం విచ్చేశారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను స్థానికులు ఆయనకు తెలియజేయడంతో..కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎంపీ నిధి నుంచి రూ.13 లక్షల నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఆర్‌సీఎం చర్చిని గుంటూరు జిల్లాకే రోల్ మోడల్‌గా నిర్మించారని కొనియాడారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, చర్చి సమీపంలోని కాలువపై నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వ రంగ సంస్థలతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎంపి బాలశౌరి హామీ ఇచ్చారు.

ఉప్పొంగిన ఉత్సాహం

ఫిరంగిపురం: సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తాడికొండలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు పలు గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో శనివారం తరలివెళ్లారు. వాహనాలను జెండా ఊపి జెడ్పీటీసీ కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి ప్రారంభించారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ 3 వేల మంది వంద ఆటోలు, 36 బస్సులు, 100 ద్విచక్ర వాహనాలు, 25 కార్లలో తరలి వెళ్తున్నట్లు తెలిపారు. కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఐన్నయ్య, చేవూరి రామమోహన్‌రెడ్డి, డి.సురేష్, ఎస్.నాగరాజు, ఎం.సురేష్, ఎం.బాబు ఉన్నారు.

నగరంలో ముదిరాజుల చైతన్య రథయాత్ర



నెహ్రూనగర్: రాజకీయాలకు అతీతంగా సమర్థ ముదిరాజు సమాజాన్ని నిర్మించడమే ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజులను చైతన్య పరిచే కార్యక్రమంలో భాగంగా గుంటూరులో 'రేపటి తరం కోసం నేటి ప్రయత్నం' పేరిట ముదిరాజ్ చైతన్య రథ యాత్ర చుట్టుగుంట నుంచి ప్రారంభించి, స్వర్ణభారతీ నగర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులు రాజ్యాధికారానికి దూరంగా ఉంటు న్నారని, వారిని చైతన్య వంతులనూ చేస్తూ రాజ్యాధికారానికి దగ్గర చేసేందుకు చైతన్య రథయాత్ర ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు.ముదిరాజులంతా సమష్టిగా ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేసినప్పుడే మేలు జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి వల్లిబోయిన రాజు, సంఘ నాయకులు ఏడుకొండలు, సాంబశివరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు..



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటంతో..



సామాజిక సాధికార యాత్రలో తాము సైతం అంటూ మద్దతు తెలుపుతున్న ప్రజలు

తాడికొండంతా
అభిమాన నినాదం

తాడికొండలో శనివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర కొండంత అభిమాన గణం మధ్య సాగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీల జై జగన్ నినాదాలతో వీధులు, సభా ప్రాంగణం మార్మోగింది. అడుగడుగునా.. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వకర్త మేకతోటి సుచరిత, మంత్రులకు ఘన స్వాగతం లభించింది.

– తాడికొండ



బ్రహ్మరథం పట్టిన జన సందోహం మధ్య వాహన శ్రేణి..



సామాజిక సాధికార యాత్రలో పాల్గొనేందుకు పోటెత్తిన యువత...

క్రీడా ప్రతిభను వెలికితీస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'

తాడేపల్లిరూరల్: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహిస్తున్నారని ఎంటీఎంసీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శనివారం తాడేపల్లి దేవదాయ భూముల్లో నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆయన సందర్శించారు. ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సెక్రటరీలు శ్రీనివాసరావు, రాధాకుమారి, మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు యు కల్యాణ్ పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..
దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆటల పోటీలను శనివారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవా ణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆటల పోటీల్లో పాల్గొన్నారని, వారి ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. మండలంలో జరిగిన ఆటల పోటీలను ఎంపీడీఓ వీరయ్య పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



ఉండవల్లిలో క్రీడాకారులను అభినందిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి



దుగ్గిరాల కేఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు



దుగ్గిరాల ఈమనిలో క్రికెట్ ఆడి, మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే

తాడేపల్లిరూరల్ : పిల్లలు చెడిపోతున్నారంటే తల్లిదండ్రులదే బాధ్యతని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్ లత అన్నారు. శనివారం మంగళగిరిలోని ఐబీఎన్ ప్రెస్ క్లబ్ భవన్‌లో బాలల హక్కుల రక్షణ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ లత మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని, ఇప్పటికే తాము అనేక బాల్య వివాహాలను అడ్డుకోగలిగామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేశామని, అందరి సహకారంతో పూర్తిస్థాయి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైట్స్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజలు ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని, పిల్లలపై తల్లిదండ్రుల పర్యవక్షణ అవసరమన్నారు. జేఏసీ కన్వీనర్ మహమ్మద్ యూసఫ్ మాట్లాడుతూ దేవంలో ఒక ఏడాదిలో 30 వేల మంది అదృశ్యమయ్యారని ఇది చాలా బాధాకరమన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మేకల మోహనరావు, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కె.అనూష, మంగళగిరి మండల కో–ఆర్డినేటర్ ఎం.నాగమణి, గుడ్ షెపర్డ్ సిబ్బంది ఇశ్రాయెల్, ప్రతినిధులు అనిల్‌కుమార్, విజయలక్ష్మి, అడ్వకేట్ విజయ రాఘవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్ లత

'దిశా' కేసుల్ని త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ

నగరంపాలెం: దిశా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. దిశా పోలీస్‌స్టేషన్ (పీఎస్)ను శనివారం ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ వద్ద బాధితులతో ఎస్పీ మాట్లాడారు. ఏ సమస్యపై వచ్చారు.. స్టేషన్ పోలీసు అధికారులు ఎలా స్పందించారనే అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదిదారుల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారుల్ని ఎస్పీ ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా మెలగాలని సూచించారు. ప్రతి అర్జీని రిజిస్టర్‌లో నమోదు చేసి రశీదు అందించాలని చెప్పారు. న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలని తెలిపారు. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలలు, పాఠశాలలు వద్ద దిశా చట్టం, యాప్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. విజిబుల్‌గా ఉండేలా దిశా వాహనాలను నడిపి మహిళలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తూర్పు సబ్ డివిజన్ ఏఎస్పీ నచికేత్ షెల్కే, సీఐ నరేష్‌కుమార్, ఎస్‌బీ సీఐ ఎస్.వి.రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిన కార్యకర్తలు

మేడికొండూరు : తాడికొండ అడ్డరోడ్డు నుంచి బస్టాండ్ వరకు నియోజకవర్గ సమన్వయకర్త, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు శనివారం భారీగా తరలి వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ స్వప్న రాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీల ఆధ్వర్యంలో పేరేచర్ల నుంచి డోగిపర్రు, విశదల, మందపాడు గ్రామాల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కందుల సిద్దయ్య మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఎవరి ప్రమేయం లేకుండా వేల సంఖ్యలో బస్సు యాత్రకు తరలి వెళ్లారన్నారు. యాత్ర మేళ తాళాలు, డప్పుల మధ్య కొనసాగింది.



బస్సు యాత్రకు తరలి వెళ్తున్న కార్యకర్తలు

స్వాతంత్య్ర సమర యోధుల చిత్ర ప్రదర్శన

మేడికొండూరు: పేరేచర్ల సెంటర్‌లోని యాపిల్ పాఠశాలలో శనివారం స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఫిరంగిపురం మండలం భీమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకట కమల మోహన్ చేసిన స్వాతంత్య్ర సమర యోధుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు తెలియజేసేందుకు చిత్ర ప్రదర్శన ఉపయోగపడుతుందని అన్నారు.

అంతర్గత డ్రెయిన్లలోనూ పూడికతీత చేపట్టాలి

నెహ్రూనగర్: నగర అంతర్గత డ్రెయిన్లలోనూ పూడికతీత పనుల్ని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పూర్తిస్థాయిలో చేపట్టాలని రేట్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు నగరపాలక సంస్థ అధికారుల్ని కోరారు. కమిటీ సభ్యులు శనివారం నాజ్ సెంటర్ ఎల్ఎల్ఆర్ వాటర్ ట్యాంకుల్లో ఈఈ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ అయుబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హిదయతుల్లాతో డ్రెయిన్లలో పూడికతీత, తాగునీటి సరఫరాపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక ఈ ఏడాది బాగా తీశారని, అదే విధంగా అంతర్గత డ్రెయిన్లలో కూడా చేపట్టాలని కోరారు. పూడికతీత పనుల్ని సమగ్రంగా చేపట్టకపోతే మురుగు నిలిచి, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి భంగం కలిగే ప్రమాదం ఉందని తెలిపారు. తాగునీటిలో క్లోరిన్‌ను తగు మోతాదులో కలపాలని సూచించారు. అనంతరం నాలా యంత్రాలు, రిజర్వాయర్‌లో క్లోరిన్ శాంపిల్స్‌ను పరిశీలించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పరంధామయ్య, నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.



అసోసియేషన్ నాయకులతో సమావేశమైన నగరపాలక సంస్థ అధికారులు

సందడిగా ఎంసీఏ పూర్వ విద్యార్థుల సమావేశం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 1995 – 1998 బ్యాచ్ ఎంసీఏ విభాగ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి అచార్య కె. గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఏఎన్‌యూ పూర్వ విద్యార్థులు ఏ దేశంలో ఉన్నా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విదేశాలలో ఉన్న అవకాశాలు, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ప్రస్తుత విద్యార్థులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీఏ విశ్రాంత అధ్యాపకులు సత్య ప్రసాద్, కృష్ణ ప్రసాద్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు ఆచార్య త్రిమూర్తి, ఆచార్య రమేష్ బాబు, వరల్డ్ బ్యాంక్ అధికారి వి.వి.ఎన్ ప్రసాద్, నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ అధికారి సురేష్, ఐటీ నిపుణులు కమలాకర్ (అమెరికా) సత్య సురేష్ (సింగపూర్), ఏఎన్‌యూ కామర్స్ అధ్యాపకులు ఆచార్య శివరామ ప్రసాద్ పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ అభివృద్ధికి సాయం చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

వియత్నాం బుద్ధిస్ట్ యూనివర్సిటీతో ఎంఓయూ
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుద్ధిజం విభాగం , వియత్నాం బుద్ధిస్ట్ యూనివర్సిటీల మధ్య శనివారం అవగాహనా ఒప్పందం జరిగింది. వియత్నాంలోని బుద్ధిస్ట్ యూనివర్సిటీలో ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన రెండవ కంబోడియా లాటిస్, వియత్నాం బుద్ధిస్ట్ ఇంటర్నేషనల్ శిఖరాగ్ర సమావేశంలో ఏఎన్‌యూ బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఎల్. ఉదయకుమార్ పాల్గొన్నారు. 'బుద్ధిస్ట్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ న్యూ వాయిస్ ఇన్ రెస్పాన్స్ టు ది ఎన్విరాన్మెంటల్ క్రైసిస్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సదస్సులో వియత్నాం బుద్ధిస్ట్ యూనివర్సిటీ వైస్ రెక్టర్ ప్రొఫెసర్ ట్రిచ్ న్హత్ టు, ఏఎన్‌యూ బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఉదయ్ కుమార్ ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఇందులో భాగంగా బౌద్ధ శాస్త్రంలో సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించానున్నారు. ఎంవోయూ పత్రాలను ఆచార్య ఉదయకుమార్ శనివారం ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్‌కు అందజేశారు.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS:73/2018

Between :
యేమినేని రామచంద్రరావు .. వాది
మరియు
షేక్ శ్రీను బాషా .. ప్రతివాది


టు: ప్రతివాది : షేక్ శ్రీను బాషా, తండ్రి షేక్ ఖాదర్‌వలీ,@బాజుర్‌వలి పెనుమూలి గ్రామం, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పై దావాలో నోటీసులు జారీ చేసిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ దావాను ది.11-01-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 11-01-2024

వెలినేని రాఘవయ్య
వాది తరుపు అడ్వకేట్, తెనాలి, గుంటూరు జిల్లా

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనుకొండ వంతెన వద్ద పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని శనివారం పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యామ్నాయ చర్యలు

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్న నేపథ్యంలో పట్టణంలో ప్రతిరోజు జరిగే పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. పట్టణ పరిధిలోని సచివాలయ శానిటరీ సెక్రటరీలతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సమ్మె వీడేంతవరకు శానిటరీ సెక్రటరీలు ఉదయం 5.30గంటలకే విధులకు హాజరు కావాలని సూచించారు. చెత్త సేకరించే వారికితో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి రోజు చెత్త సేకరణ నూరుశాతం జరిగే విధంగా చూడాలని చెప్పారు. ఎవరు విధులకు గైర్హాజరు కాకుండా సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహించాలని సూచించారు. ఎంఈ కె.నాగమలేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు. సమ్మెలో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘ నాయకులతో కమిషనర్ జశ్వంతరావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమ్మెను విరమించాలని సూచించారు. సమ్మెలో ఉండటం వలన పారిశుద్ధ్య నిర్వహణ పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదని చెప్పారు. అందరూ సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు

మున్సిపల్ కార్మికుల నిరసన

తెనాలిఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె శనివారంతో ఐదో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు ఉరితాడులు మెడకు వేసుకున్ని నిరసన తెలియజేశారు. యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.